

# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### ఒక్కమడి కూడా తడవదు

నాకు ఐదెకరాల భూమి ఉన్నది. ఇప్పుడు కేసీఆర్ సారు ఇచ్చిన రైతుబంధు, 24 గంటల కరెంటుతో మంచిగ పంటలు పండించుకుంటున్నం. గా కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్ చాలు అన్నంక మాకు బాధైంది. మూడుగంటలు ఉంటే ఒక్క మడి కూడా తడవదు. తెలంగాణ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తుండటంతో మోటర్ల ద్వారా పంటలు బాగా పండిస్తున్న. కాంగ్రెసోళ్ల మాటలతో మళ్లీ పాత రోజులే వస్తయని భయమేస్తంది. అప్పట్ల రాత్రి పూట12 గంటలకు కరెంట్ పెట్టడానకి పొలాలకు పోయచ్చేది. ఆ కష్టాలు మళ్లీ అనుభవించం. 24 కరెంట్‌తో అటోమెటిక్ మోటర్లు పెట్టుకుని కష్టాలు లేకుండా సాఫీగా సాగు చేసుకుంటున్నం. మల్ల గా కాంగ్రెసోళ్లను రానియ్యం. రైతుల కోసం ఆలోచించే కేసీఆర్ సారే రావాలి.

**- పెద్దిగారి మల్లేశం రైతు, వెలిచాల, రామడుగు(చొప్పదండి)**

### 10 హెచ్‌పీతో రైతుకు భారమే



రైతులు వ్యవసాయానికి ఎక్కువగా 3 హెచ్‌పీ మోటర్లు వాడతరు. ఎక్కువ దూరం పైపులు వాడితే మాత్రమే 5 హెచ్‌పీ మోటర్లు వాడతరు. 10 హెచ్‌పీ మోటర్లు వాడితే విద్యుత్ లోవోల్టెజీ సమస్యలతో పాటు రైతులకు అధిక భారమవుతుంది. ప్రస్తుతం ఉన్న పైపులైన్లు, మోటర్లు, స్టాటర్లు మార్చవలసి వస్తుంది. లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తుంది. రైతులకు అదనపు భారం పడుతుంది. కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు తీసుకోవల్సి వస్తుంది. 10 హెచ్‌పీ మోటర్లకు అధిక విద్యుత్ అవసరం ఉంటుంది. ఇప్పుడు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, పని చేయవు. గతంలో లోవోల్టేజీ, కోతలతో రైతులు మస్తు ఆగమైన్రు. మళ్లీ ఆ బాధలు పడాలని ఏ రైతు కూడా కోరుకోడు. కోరి కరెంటు కోతలు తెచ్చుకోడు. కేసీఆర్ వచ్చినంక కరెంటు బాధలు తప్పినయ్.

**- వెంకటేశ్, మోటర్ వైండింగ్ మెకానిక్, దుర్శేడ్ (కరీంనగర్ రూరల్)**

### సోయిలేకుంట మాట్లాడుతున్నరు

తెలంగణ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంటుపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు సోయిలేకుంట మాట్లాడుతున్నరు. రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి 3 గంటల కరెంటు సాలంటడు. గా కేంద్ర మంతి నిర్మలా సీతారామన్ మోటర్లకు మీటర్లు పెట్టాలని మాట్లాడుతున్నది. మూడు గంటల కరెంటు ఎక్కడ సరిపోతదో రేవంత్‌రెడ్డే చెప్పాలె. మోటర్లకు మీటర్లు పెట్టి కేంద్ర మంత్రి రైతులను ఆగం చేయాలని సూత్తున్నది. రాష్ట్రాన్ని, రైతులను ఆగం చేయడంగానికి కాంగ్రెస్, బీజేపోళ్లు మొపైంద్రు. వీళ్లను నమ్మి గిట్ల ఓటు వేస్తే మళ్లీ చీకటి రోజులు చూసుడు ఖాయం.

**- అట్ల రాజిరెడ్డి, ర్యాలపల్లి(గంగాధర)**





### అంత పెద్ద మోటర్లు ఎవరు కొంటరు

*పదేళ్ల నుంచి మంచిగ బతుకుతున్నం. మేం మంచిగుండుడు కాంగ్రెసోళ్లకు ఇట్టం లేదు. మూడు గంటల కరెంటు సాలని ఒగడు.. 10హెచ్‌పీ మోటారని ఒగడు. మూడు గంటలెట్ట సాలుతది. 10హెచ్‌పీ ఎవడు కొంటడు. ఎవుసం తెల్వనోడు మాట్లాడితే ఐపోతదా..ఏంది. మమ్మల్ని కోతకేత్తరా ఏంది. 10హెచ్‌పీతోటి ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటయా..? కాలిపోతయ్. మళ్ల కరెంటోళ్ల సుట్టూ తిరగాల్నా. పంటలెండల్నా. అయినా ఇప్పుడున్న మోటార్లతోటి హాయిగున్నం. మడులు తడుస్తున్నయ్. మళ్ల 10హెచ్‌పీలు లక్షలు పెట్టి ఎట్లా కొంటం. అప్పుల పాల్జేత్తరా ఏంది. ఇప్పుడు రందిలేకుండా పెళ్లం, పిల్లలతో మంచిగ బతుకుతున్నం. మా బతుకుల మీద దెబ్బ కొడ్తమంటే ఎందుకూరుకుంటం. పదేళ్ల నుంచి దగ్గరి రాకుండా సేసినం. బుద్ధి రాలే. మళ్లీ మా మీదకు వత్తన్న రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్తం. బీఆర్‌ఎస్‌నే గెలిపించుకుంటం.*

**-శ్యామల సుధాకర్‌రెడ్డి, రైతు, పెద్దంపల్లి(జమ్మికుంట)**

# మీ దరిద్రపు పాలన మాకద్దు

- నాడు ఎన్ని కష్టాలు పెట్టారో మేం మరిచిపోలే
- యాభై ఏండ్లు పాలించి చేసింది గుండు సున్నా
- మూడు గంటలతో ఏం పంట పండించుకోమంటవ్
- మీరు వచ్చేది ఉందా..? సచ్చేది ఉందా..?
- తెలివి ఉన్నోడు ఎవడన్నా.. 10హెచ్‌పీ మోటర్ పెట్టుకుంటడా..?
- ఒక్కో రైతు లక్ష రూపాయలు ఎక్కన్నుంచి తెమ్మంటరు
- మీరు ఫ్రీగా ఇస్తరా..? కొనిస్తరా..?
- స్పష్టం చేస్తున్న రైతులోకం

కరీంనగర్, నవంబర్ 24(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ డేంజర్ పార్టీ. రైతులను గోసపెట్టే పార్టీ. ముందునుంచీ రైతులకు వ్యతిరేకి. యాభై ఏండ్లకుపైగా పాలించి ఏం చేసింది..?, గుండు సున్నా. కరెంట్ ఇయ్యక, నీళ్లు ఇయ్యక గోసపెట్టింది. పంటలు ఎండిపోతున్నా కనీసం పట్టించుకోలె. చచ్చిపోతున్నా సంబంధం లేన్నట్లే ఉన్నది. వేలాది మందిని పొట్టనబెట్టుకున్నది. తెలంగాణ వచ్చి కేసీఆర్ సీఎం అయ్యాక 24 గంటల కరెంట్ ఇస్తుంటే.. కండ్లుమండించుకుంటున్నది. ఇప్పుడిప్పుడే మేం మంచిగా బతుకుతున్నం. ఆ దరిద్రపు పార్టీ మాకెందుకు..? ఏదో వెలగబెడతాం అన్నట్టు.. ఆ పార్టీ పార్టీ నాయకులు వచ్చి మాకు మాయమాటలు చెబుతున్రు. వాళ్లను ఎవడైనా నమ్ముతడా..? ఉరికిచ్చుకుంట కొడుతరు. బీఆర్‌ఎస్ సర్కారు 24గంటల కరెంట్ ఇస్తాంటే.. వాళు మూడుగంటలు ఇస్తరట.. మతి ఉండే మాట్లాడుతున్నరా..? 24గంటలు ఉండంగ వాని కరెంట్ ఎవరికి కావాలి..? 10 హెచ్‌పీ మోటర్ అంటున్నరు. ఒకసారి అందరూ ఆలోచించాలి. అంత పెద్ద మోటర్ రైతులెవరైనా వాడుతరా..? మేం ఇంత వ్యతిరేకిస్తున్నా..? మేమేదో చేస్తామంటూ నమ్మించే ప్రయత్నం చేస్తున్రు. మమ్మల్ని ఆగం చేయాలని చూస్తున్రు. మళ్లీ మేం మోసపోం. మా బతుకుల్లో మట్టి పోసుకోం' అని జిల్లా రైతులు స్పష్టం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ సర్కారు రైతుల కోసం 24 గంటల కరెంట్, సాగునీరు, రైతు బంధు, రైతుబీమా ఇస్తున్నదని, అన్నదాతలు ఇప్పుడిప్పుడే సంతోషంగా బతుకున్నారని చెబుతున్నారు. కానీ, కాంగ్రెస్ ఓర్వలేకపోతున్నదని, అందుకే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని, మంచి పథకాలను రద్దు చేస్తామంటున్నదని మండిపడుతున్నారు. ఎన్నికల్లో ఎలాగైనా లబ్ధి పొందాలన్న ఉద్దేశ్యంతో అబద్ధపు హామీలు, ఝూటా మాటలు చెబుతున్నదని విమర్శించారు. ఆ పార్టీని నమ్మేది లేదని, ఈ ఎన్నికల్లో కచ్చితంగా బుద్ధి చెబుతామంటున్నారు. రైతుకు అన్ని విధాలా అండగా నిలిచిన బీఆర్‌ఎస్ సర్కారునే మళ్లీ గెలిపించుకుంటామని చెబుతున్నారు.

### ఎవుసం చేయలేని పరిస్థితి వస్తది



కాంగ్రెస్ చెబుతున్నట్టు రైతులంతా 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవడం సాధ్యం కాదు. ఎందుకంటే ఎక్కువ మంది రైతులు నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. ఇప్పుడు వాడుతున్న మోటర్ల రేట్ల కంటే 10 హెచ్‌పీ మోటర్లకు నాలుగింతల మీదనే ఉంటది. ఇక రైతులు ఈ 10 హెచ్‌పీ మోటర్లు ఎట్ల కొంటరు. ఎవుసం చేయలేని పరిస్థితి వస్తది. ఇప్పుడున్న పుష్కలమైన కరెంట్‌తో రైతులు నీరు పారుస్తూ సంతోషంగా ఉన్నరు. కాంగ్రెస్ నాయకులకు వ్యవసాయంపై చిత్తశుద్ధి లేదు అనడానికి ఈ మోటర్లు పెట్టాలనడమే నిదర్శనం. కాంగ్రెస్ చెప్పిన ఈ మాటతో రైతులంతా ఆందోళనగా ఉన్నరు.

**- కే తిరుపతిరెడ్డి, మల్కాపూర్(కొత్తపల్లి )**

### కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి మోసపోం



నాకు ఊర్ల 2 ఎకరాల పొలం ఉన్నది. నాడు కరెంట్ కోసం పడ్డ గోస ఇప్పుటికీ కండ్ల ముందే కనపడుతంది. కాంగ్రెస్ పాలనలో ఏకంగా 30 ఏండ్లు గోసపడ్డా. ఆ బాధలు తలుచుకుంటే ఇప్పటికీ ఏడుపు వస్తది. మళ్లీ కాంగ్రెస్ వస్తే రైతుల బతుకులు ఆగమైతాయ్. చెరువులు, కుంటలు, కాలువ నీళ్లను చూస్తే కేసీఆర్ కనిపిస్తాడు. ఇప్పుడు సాగునీళ్లకు ఎలాంటి డోకా లేదు. మంచిగ పంటలు పండించుకుంటున్నం. ఇప్పుడు కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి ఓటు వేస్తే మళ్లీ మోసపోవడం ఖాయం.

**-రావుల కొమురయ్య, రైతు (ఇల్లందకుంట)**

### మళ్లీ అర్ధరాత్రి పొలాలకు పంపిస్తరా?



ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న కరెంటు మాకు సౌకర్యవంతంగా ఉన్నది. కరెంటు ప్రాబ్లం లేదు. మోటర్లు కాలుడు కూడా లేదు. ఇంత మంచిగ ప్రభుత్వం కరెంటు అంస్తంది. గతంల కరెంటుకు చాలా ఇబ్బంది ఉండేది. తెలంగాణ రాక ముందు కరెంటు కష్టాలు ఎన్నో ఉండేవి. పొలానికి నీళ్లు పెట్టేందుకు అర్ధరాత్రి, తెల్లవారుజామున పోవాల్సి వచ్చేది. సీఎం కేసీఆర్ వచ్చాక సమస్యలు అన్నీ తీరినయ్. కరెంటు మంచిగ ఇచ్చే సీఎంనే రైతులు నమ్ముతరు. గా కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు గానీ, పనికి రాని ముచ్చట్లన్నీ చెబుతంది. మళ్లీ అర్ధరాత్రి కరెంటిచ్చి పొలాలకాడనే పడుకునేటట్టు చేసెటట్టున్నది.

**- మునిపాల రవి, రైతు, వెన్కేపల్లి(సైదాపూర్)**

### రైతుల బతుకు ఆగమే..



మూడు గంటల కరెంట్ అయితే రైతుల బతుకు ఆగమైతది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 24 గంటల కరెంట్ ఇవ్వడంతో రైతులు ఎంతో బాగు పడ్డారు. కాల్వల ద్వారా వచ్చిన నీళ్లు, 24 గంటల కరెంట్ రైతు బతుకుకు భరోసానిచ్చాయి. మూడు గంటల కరెంట్ సరిపోతుందని కాంగ్రెస్ వాళ్లు చెప్పడం రైతుల పట్ల చిన్న చూపు చూడడమే అవుతుంది. వారికి ఓటేస్తే ఎనుకటి కష్టాలను మళ్లీ ఓటేసి మరీ తెచ్చుకున్నట్లయితది. అందుకని మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాలి, రైతులందరికీ 24 గంటల కరెంట్ కావాలి. రైతుల పక్షపాతి అయిన కేసీఆర్, బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే రైతు ప్రభుత్వం మళ్లీ వస్తది.

**-కందుల సమ్మిరెడ్డి, రైతు, (పరకాల క్రాస్‌రోడ్, హుజూరాబాద్‌టౌన్)**